# బాలల నీతి కథలు.

రచన-

ఆదూరి. హైమవతీ శ్రీనివాసరావు.

## అక్షర పత్రిక లో మరికొన్ని పత్రికల్లో ప్రచురింపబడిన బాలలకథలు.

1.ఆకలి.

2.నిద్ర.

3.దానం.

4.మంచి.

5. మాట.

6.శ్రమ.

7.త్యాగం.

8. క్షమ .

9.బడాయి భూరుహం.

10.శుభ్రతకు బహుమతి .

11.ఈవి నోచని బ్రతుకు.







## 1.ఆకలి.

పూర్వం పల్లవ రాజ్యాన్ని పవిత్ర వర్మ అనే రాజు పాలించేవాడు.అతడికి లేకలేక ఒక కుమారుడు కలిగాడు.అతని భార్య భామతి బిడ్డను అపురూ పంగాచూసుకునేది. ఆబిడ్డకు అపూర్వ వర్మ అనేపేరు పెట్టు కున్నారు దంపతులు. ఆపూర్వ వర్మకు ఐదేళ్ళు నిండుతుండగా అతడ్నితమ కుల గురుపైన `జ్ఞానానందుని 'గురుకులంలో విద్యాభ్యాసంకోసం చేర్చాలని నిర్ణయించుకున్నాడు పవిత్రవర్మ.ఆ మరునాడే శుభదినమని గురువు చెప్పాక మహారాణికి విషయం చెప్పాడు పవిత్రవర్మ.

వెంటనే మహారాణి భామతి, "మహారాజా! కుమారుని గురుకులానికి పంపేబదులుగా గురువుగారినే అంతః పురానికి పిలిపించి విద్యాభ్యాసం చేయించవచ్చుకదా! కుమారుని వదలి నేను జీవించలేను మహారాజా!" అనింది.

"మహారాణీ ! మన సాంప్రదాయం గురుకులంలోనే ఇతర విద్యార్థులతో కలిసి జీవిస్తూ విద్యాభ్యాసం చేయడం, దాన్ని మార్చడం శ్రేయోదాయకం కాదు.కుమారుని భవిత గురించీ ఆలోచించి మీరు కుమారుని వదలి కొంతకాలం జీవించకతప్పదు.రాజోచిత విద్యలన్నీ ఆశ్రమంలో నేర్పడం ఆనవాయితీ." అని బదులిచ్చాడు. ఆరాత్రి అపూర్వ వర్మకు అన్నం తినిపిస్తూ భామతి" ఈకాస్తాతిను కుమారా! బంగారంకదూ!" అంటూ బ్రతిమాలడం చూసిన పవిత్రవర్మ 'ఇంతగారాబం చేయడం కుమారునికి మంచిదికాదు' అని భావించాడు. మహారాణి కుమారునితో "కుమారా!ఆశ్రమంలో నీకు ఆకలైతే గురుపత్నికి విన్నవించు. ఆకలితో ఉండకు కుమారా!" అనిచెప్పగా, దానికి అపూర్వ వర్మ "ఆకలంటే ఏమిటి మాతా!" అని అడిగాడు. అదివిన్న మహారాజు మనస్సులో ఒక నిర్ణయానికి వచ్చాడు.మరుదినం అపూర్వ వర్మ ను తీసుకుని గురుకులానికి బయల్దేరాడు పవిత్ర వర్మ.కుమారుని గురువుకు అప్పగించి, అతడికి ఏదో రహస్యంగా విన్నవించుకుని వచ్చాడు.

గురుకులంలో అందరితోపాటుగా అపూర్వ వర్మకూడా వేకువనే లేచి గంగా స్నానం ఆచరించి, యోగవిద్యలు గురువు చేస్తుండగా అనుసరించి, పక్కనే ఉన్న అడవినుంచీ పూలూ, ఫలాలూ సేకరించి తెచ్చాక , గురుపత్ని అందించే గోక్షీరం , పండ్లు సేవించి, మధ్యా హ్నం వరకూ విద్యా భ్యాసం చేయాల్సి వచ్చేది. ఏదో తెలీని బాధ అతడి కడుపులో కలగ సాగింది. ఒక మధ్యాహ్నం అతడు పొట్ట పట్టుకుని బాధ పడుతుండగా చూసిన తోటి విద్యార్థులు వెళ్ళి గురువు గారిని పిల్చుకువచ్చారు. గురువు `జ్ఞానానందులు వచ్చి అపూర్వుని పరీక్షించి , చిఱునవ్వుతో " కుమారా! ఇదే ఆకలంటే !ఇది వ్యాధికాదు , ఆకలైనపుడు కడుపులో ఇలాంటి బాధ కలుగుతుంది.దేశంలో ఎందరో పేదలు ఈ ఆకలి తీర్చుకోను అనేక కష్టాలు పడుతుంటారు. చేద్దామన్నా తగినపనిదొరక్క ,లభ్యమై

నది చేయలేక ఇబ్బంది పడుతుంటారు  నాయనా !ప్రజల ఆ పేదరికాన్ని పోగొట్టి వారి ఆకలితీరను  తగిన చర్యలు చేపట్టి ,వారిని ఆదుకోడం  రాజు కర్తవ్యం."అని చెప్పి అతడి ఆకలి తీర్చాడు. అలా ప్రతి విషయం చలి, ఎండ వానల నుంచీ రక్షణ , నివాసం, నీటి అవసరం , శరీరం కప్పుకోను వస్త్రాలు మొదలైనవన్నీ  అనుభవపూర్వకంగా నేర్పారు.యుద్ధవిద్యలతో పాటుగా ,యుద్ధనీతి, రాజ నీతి,రాజు విధులు ,కర్తవ్యంకూడా నూరిపోశారాయన. యువరాజు సుశిక్షితుడైన పాలకునిగా తయారయ్యాక అతడ్ని రాజభవ నా ని కి పంపారు జ్ఞానానందులు.  యువరాజు అపూర్వునికి తండ్రి పవిత్ర వర్మ తనకు వయస్సు పైబడటంతో రాజ్యాభిషేకం చేశాడు. అపూర్వుడు ప్రజల అవసరాలు తీర్చను తగిన పనులు వారికి కల్పించి స్వయంగా వారే తమ కు కావల్సిన ధనం సంపాదించుకునే లాగా తీర్చిదిద్దాడు.గొప్పపాలకుడని పేరుపొందాడు.

**************



## 2.నిద్ర.

జానకీ పురం జమీందారు జనప్రియ వర్మకు కొంత కాలంగా చిత్రమైన వ్యాధి పట్టుకుంది.హంసతూలికా తల్పం మీద ఎంత పొర్లినా నిద్ర పట్టక బాధ పడసాగాడు . ఆస్థాన వైద్యుడు ఎన్ని మందులు ఇచ్చినా ఉపయోగం కనిపించలేదు. జమీ వ్యవహారాలు చూడను కూడా కూర్చునే ఓపికలేక  బాధపడ  సాగాడు జమీందారు. జమీందారిణికి భయం పట్టుకుంది. ఆమె దివానును పిలిపించి  కుల గురువైన  వల్లభాచార్యులకు వివరంగా లేఖ వ్రాసి పంపమని కోరింది.  వార్తాహరుడు తెచ్చిన ఆలేఖ చదివి వల్లభాచార్యులు బదులు వ్రాసిచ్చి పంపారు.ఆలేఖాంశాలు విన్న జనప్రియ వర్మ ఆమరునాడే దివాను తో  కలిసి గురుకులానికి బయల్దేరాడు. వల్లభాచార్యులు సూచించిన విధంగా  ప్రాతః కాలంలోనే అంతః పురం నుంచీ కాలినడకన కులదైవమైన సూర్య దేవాలయం చేరి, ఆ భవనాశిలో స్నాన మాచరించి, దేవుని అర్చించి గర్భాలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, ప్రసాదం స్వీకరించి, ఆలయం నుంచీ గుఱ్ఱపు బగ్గీలో ప్రయాణం సాగించాడు. మధ్యాహ్నానికి మాదిరాజపురం చేరాక అక్కడి పూటకూళ్ళమ్మ ఇంట్లో నేలపై కూర్చుని అరిటాకులో వేడివేడి జొన్నసంకటిలో,కొరివికారంలో ఉల్లినంచుకుంటూతిని ,అల్లం కరివేప,కొత్తిమిరవేసిన జారు పెరుగు తోభోజనం చేసి , అక్కడినుంచీ గుఱపు స్వారీ చేస్తూ సాయం కాలానికి సోమేశ్వరాలయం చేరారు. అది ఎంతోపురాతన దేవాలయం ,ఆస్వామిని దర్శిస్తేనే శారీరక, మానశిక కష్టాలు తీరుతాయనీ ,ఆరోగ్యం కుదుట బడుతుందని పజలవిశ్వాసం.101 మెట్లు ఎక్కి కొండపైభాగాన ఉన్న స్వామిని దర్శించి, ప్రసాదం స్వీకరించి, అక్కడి చల్లని వృక్షాల క్రింద కొంత సమయం కూర్చుని,కొండదిగి ,కాలినడకన ప్రయా ణం సాగించి సూర్యాస్తమయం అయ్యాక  ఒక ఝాముకు వల్లభాచార్యుల వారి గురుకులాశ్రమంచేరారు. వల్లభాచార్యులు జమీందరును సగౌరవంగా ఆహ్వానించి,  వేడినీరు స్నానానికి  ఏర్పాటుచేశాడు. అనంతరం కమ్మని వేడివేడి భోజనం ఆకుకూర ,రసం , మజ్జిగతో ,పెట్టించి "ప్రాతః కాలంలో మాట్లాడుకుందాం విశ్రాతిపొందు కుమారా!"అని పడక ఏర్పాటు

చేశారు.ఒక తుంగ చాపమీద, పాత పంచ పరిచి ఉండగా జమీందారు పవ్వళించగానే నిద్రలో మునిగిపోయాడు . ఆగురుకులంలోనే తాను పూర్వం విద్యనభ్యసించడం వల్ల ఆప్రాంతమంతా సూపరిచితం .  మరునాడు ప్రాతః కాలంలోనే ఆచార్యుల వెంట రెండుమైళ్ళ దూరం లోని నదీస్నానం చేసివచ్చి ఆచార్యునితోపాటుగా పూజాదికాలలోపాల్గొని ,శిష్యులతోపాటు కూర్చుని కమ్మని ఫలాలు, వేడిపాలు సేవించాడు.ఆతర్వాత ఆచార్యుడు,శిష్యులు అంతా కలసి పూల మొక్కలు, కూరలపాదులు,ఫలవృక్షాలకు నీరు, ఎరువు పెట్టి, ఎండి పోయిన కొమ్మలు, ఆకులు తొలగించి,వచ్చి విద్యాభ్యాసంలో మునిగారు.  దివానుతోకలసి తమఆశ్రమం చుట్టూ ఉన్న ప్రాంతాలను దర్శించి రమ్మని జనప్రియ వర్మకు సూచించారు ఆచార్యులు. మిట్టమధ్యాహ్నం వరకూ ప్రకృతిని దర్శించివచ్చి, వేడివేడి సాత్విక భోజనం చేశాక , ఆశ్రమంలోని ఉసిరి,వేప వృక్షాల క్రింద ఆచార్యునితో పాటుగా కూర్చుని ముచ్చటించి,సాయంకాలం తిరిగి నడిచి నదీ స్నానమాచరించి వచ్చి , ధ్యానాదులలో పాల్గొని, భుజించి పడకచేరగానే కమ్మగా నిద్రలోకి జరుకున్నాడు జనప్రియ వర్మ. ప్రాతఃకాలానికి అతడికి శరీరమూ మనస్సూ హాయిగాఉన్నాయి.ఆశ్చర్యంగా ఆమరునాడు నదీస్నానాకివెళ్ళేప్పుడు జనప్రియ వర్మ,    " ఆచార్యా! ఇంతహాయిగా నిద్రించి ఎంత కాలమైందో!మీరేదో మంత్రం పఠించి నాకు నిద్రను ప్రసాదించారు."అన్నాడు నమ్రతగా. "కుమారా! ఏమంత్ర తంత్రాలూ లేవునాయనా! తిన్నదానికి తగిన శరీరశ్రమ చేయడమే ఆమంత్రం.మనశర 'మర'కు పనికల్పించక పోతే తుప్పుపట్టడం ఖాయం, నాయనా! నీవు నీ జమీ గ్రామాల్లో జమీందారుగా కాక మారు వేషంలో సాధారణ పౌరునిగా సంచ రించు. పేదపల్లెప్రజల కష్టసుఖాలు పరిశీలించు.రైతుల ఇబ్బందులుగ్రహించు. ఉద్యోగుల నివేదికలుకాక నీమసు నివేదికతో పని సాగించు. సాత్వికాహారాన్ని మాత్రమే భుజించు, చూడూ 35ఏళ్ళకే నీశరీరం ,పొట్ట పెరిగిపోయాయి.ఈమూడురోజుల్లోనే నీలో మంచి మార్పు శారీరకంగానూ వచ్చింది. ప్రాతఃకాలంలో లోకబాధవుని వెచ్చని కిరణాల్లో ఉద్యోగులతో జమీ విశేషాలుముచ్చటిస్తూ నడక సాగించు. ఇక్కడ జీవించిన విధంగా నీ జీవనసరళీమార్చుకో.కమ్మని నేయి, చిక్కనిపాలూ, పెరుగు,వెన్న మాంసాహారభోజనం, శ్రమ లేకుండా కూర్చోడం ఇవన్నీ నీశారీరక మానశిక పరిస్థితులపై ప్రభావం చూపాయి. అంతేనాయనా! వెళ్ళిరా ! పదికాలాలపాటు జన రంజకంగా పాలించు ." అంటూ ఆశీర్వదించి పంపారు ఆచార్యులు.

**********



# 3.దానం.

పూర్వం అవంతీదేశాన్ని అనంతవర్మ పాలించేకాలంలో ప్రజలంతా సుఖసంతోషాలతో హాయిగా జీవించ సాగారు. ఒకసందర్భంలో అనంతవర్మ తన ప్రధాన అమాత్యుని తోకలసి మారువేషంలో ఒక రాత్రి రాజ్య సంచారం చేస్తుండ గా అతడొక దృశ్యం చూశాడు.ఒక గృహస్తు ఒకఎనభై ఏళ్ళ ముసలి వ్యక్తికి ఒక చిన్న పాత్రలో గంజిపోసి ఇవ్వగా అతడా గంజిచూసి," నాయనా! ఈరోజైనా ఇన్ని మెతుకులు పెడతావను కున్నాన య్యా! ఈరోజు గంజే ఇస్తు న్నావు? వారం నుంచీ ఈగంజిత్రాగి నీరసించిపోతున్నానురా! "అన్నాడు. దానికా వ్యక్తి"ఏంచేయను నాయనా! ఇంట్లో తిండిగింజలు నిండుకున్నాయి. మా యజమాని కూలీ పైకం ఇంకా ఇవ్వలేదు, ఇవ్వగానే గింజలుకొని తెచ్చి అన్నం పెడతాలే!సర్దుకో!"అన్నాడు. ఆమాటలు విన్న అనంతవర్మకు చాలాబాధ కలిగింది.తనరాజ్యంలో అన్నం మెతుకులకు అలమటించే వారున్నారంటే అది తనకే అవమానం ,తన పరిపాలనా లోపం అనిభావించి అమాత్యునితో చర్చించి , ఒక కార్యక్రమ ప్రారంభించాడు.నగరం నడి బొడ్డున ఒక తాత్కాలిక వంటశాల , భోజన శాల నిర్మించి అన్నదానం ప్రారంభించాడు."మహారాజుగారు అన్నదానం ప్రారంభించారహో! అన్నంకోసం బాధ పడేవారంతా వచ్చి భుజించడహో! " అని నగరమంతా దండోరా వేయించాడు. ఆచాటింపు విని మొదటి రోజు పదిమందీ, రెండోరోజు ఇరవైమందీ, మూడోరోజు యాభైమందీ, నాలుగోరోజు వందమందీ అలా అలాపెరిగిపోయి ఒకమాసమయ్యేసరికి వేల మంది ఉచిత భోజనానికి విచ్చేసి, రాజుగారు ఏర్పాటు చేసిన భోజనం హాయిగా భుజించి వెళ్ళసాగారు. ధాన్యాగారం తరిగి పోసాగింది. రహస్య సమావేశంలో ప్రధానామాత్యుడు ఆవిషయం అనంతవర్మకు విన్నవించుకున్నాడు. "ధాన్యం సేకరించండి మహామంత్రీ! ధనంకోసం ఆలోచించకండి, నాప్రజలు అన్నానికి అలమటించడం నేను సహించలేను."అన్నాడు అనంతవర్మ .

మహారాజు 'అన్నంకోసం అలమటించేవారు తన నగరంలో ఇంతమంది ఉన్నారా! తానుకళ్ళుమూసుకుని పేదలకు ఇంతకాలం కనీసం కడుపు కింత అన్నమైనా పెట్టలేకుండాపాలించాడా' అని వ్యధచెందసాగాడు. ఒక రోజున "చూడండి మహారాణీ!మన నగరంలో ఇంతమంది నిరాహారంగా ఇంతకాలం జీవించడం నాపాలనకే తలవంపు కాదూ!"అన్నాడు.ఆమె చిఱునవ్వు నవ్వింది."ఎందుకుమహారాణీ! నవ్వుతున్నారు?"అన్నాడు అనంతవర్మ కాస్త ఇబ్బందిగా."మహారాజా! వీరంతా నిజంగా అన్నానికి అలమటించేవారేనా!అనినా అనుమానం. ఇంతకాలం వీరంతా అన్నంకూడా లేక ఇబ్బంది పడుతూ ఉండి ఉంటేమీకు తెలీకుండా ఉంటుందా! పైగా ఇలా రోజురోజుకూ సంఖ్య పెరిగి పోతుండటంలో ఏదో మతలబు ఉందేమోని నా సందేహం."అందామె. అనంతవర్మకూడా ఆలోచనలోపడ్డాడు. అంతఃపురం పైనుంచీ చూస్తుంటే అక్కడికి భోజనం కోసం వచ్చేవారిలో చాలామంది యువకులూ, బలశాలులూకూడా ఉన్నట్లు  గమనించ మని మహారాణి సూచించింది.

ఇంతలో మహారాజు దర్శనంకోసం చాలామంది వచ్చి వేచి ఉన్నారని ఒక పరిచారిక వచ్చి చెప్పడంతో అనంత వర్మ తన సభాప్రాంగణానికి వచ్చాడు. మహారాణి కూడా  పరదా చాటు నుంచీ వీక్షించసాగింది. "మహారాజా!మేము తమరాజ్యంలో ధాన్యం పండించేరైతులం. మన్నించండి! మీరు ఉచిత అన్నదానం ఏర్పా టుచేశాక మా పంటపొలాల్లో పనిచేసే కూలీ జనమంతా పనులు మానేసి ఉచిత భోజనం రెండుపూటలా చేస్తూ హాయిగా విశ్రాతి పొందుతున్నారు.పంటపొలాలు కోసేవారులేక గింజలు నేలరాలి పోతున్నాయి. మీరే మమ్ము గింజలు ధాన్యాగారానికి తరలించమని కోరితే మేమేం చేయగలం మహారాజా! మీరే మా కష్టం తీర్చలరు." అని నమస్కరించి నిలిచారు.మహారాజు పరదాల వెనుక నున్న మహారాణి కేసి తల త్రిప్పారు. ఆయన సంకేతం గ్రహిం చి న మహారాణి పరదాల చాటునుంచీ "మహారాజా! పొలం పనులుచేసిన వారికే ఉచితభోజనం పొలాల దగ్గరికే తెచ్చిపెడతామనీ, అలా భుజించినవారికి కూలీసొమ్ము ఉండదనీ, చాటింపు వేయించండి. ఇక్కడ నడవ లేని ముసలి ముతకాకు, అవిటి వారెవరైనా ఉంటే వారికి మాత్రమే ఉచిత భోజన అనికూడా ప్రకటించండి మహారాజా! నిజంగా తిండికి అలమటించేవారుంటే ఇక్కడే ఉంటారు."అనిచెప్పారు.
వెంటనే అనంతవర్మ"రైతులారా! మాపొరపాటు మన్నించండి! మీసమస్య రేపటికల్లా పరిష్కారమవుతుంది."అని చెప్పిపంపారు.చాటింపు విన్న యువకులంతా భోజనశాల వదలి వెళ్ళిపోయారు.కేవలం సాయంకాలానికి ఒక వందమంది 70,80 ఏళ్ళ ముదుసలులు మాత్రమే మిగిలారు.

మహారాణి" మహారాజా! అపాత్రదానమూ ఒక్కో మారు దాతకే హాని చేస్తుంది.అందుకే పెద్దలు దానం చేసేముందు పాత్రతనెరిగి చేయమంటారు." అనగా, తన తొందరపాటు వల్ల వాటిల్లిన ఇబ్బంది గ్రహించిన అనంతవర్మ " నిజం! మాహారాణీ మీ విజ్ఞత ప్రశంశనీయం "అని చిరునవ్వునవ్వాడు .

పాత్రనెరిగి దానం చేయడం సముచితం కదా!

*************



## 4.మంచి.

నరసాపురంలో నల్లూరయ్య అనే ఒక రైతు ఉండే వాడు ,ఆయన చాలా ఉదార స్వభావుడు. ఎవరు కష్టంలో ఉన్నా స్వఛ్ఛందంగా వెళ్ళి ఆదుకునే వాడు.ఇబ్బందిలో ఉన్న వారికి అడక్కుండానే సాయం చేస్తుండేవాడు. అలాని అతడేమీ పెద్ద ధనవంతుడు కాడు, పదెకరాల మాగాణి పొలమున్న సాధారణ రైతు.ఐతేకష్ట పడి ఇంటిల్లిపాదీ పొలం పనులు చేస్తూ వచ్చిన దిగుబడిని చాలాపొదుపుగా వాడుకుంటూ ఉండేవారు.నల్లూరయ్య మనవడు మాధవుడు తాతతో పాటే తిరుగుతూ మంచీ చెడూ తెల్సుకుంటూ ఉండేవాడు. బళ్ళోచదువు కాగానే తాతనే అంటి పెట్టుకుని ఆయన చేసే పనుల్లో సాయ పడుతుండేవాడు.

అదేఊళ్ళో ఆదయ్య అనే ఒక భూస్వామీ ఉండేవాడు.చాలా పిసినారీ, స్వార్ధ పరుడూనూ.ఎవ్వరికీ ఎర్రని ఏగానీ ఇచ్చే వాడుకాదు.వందెకరాల ఆసామీ ఐనా ఏనాడు తన దిగుబడికి సంతోషించిన వాడూ కాదు.వచ్చినదంతా పోగుచేసుకుని దాచుకునే వాడు. అధిక ధరలు పలక గానే అమ్ముకునేవాడు. ఆదయ్య మనడు ఆనందు కూడా మాధవుని బళ్ళోనే చదివేవాడు.ఇద్దరూ బడికి కలసి వెళ్ళేవారు. దారంట వెళుతుంటే అంతా మాధవుని పలకరిస్తూ " ఏంబాబూ! తాతగారు బావున్నారా!" అని అడిగేవారు."తాతకు తగిన మనవడు, తాతతోనే ఉంటూంటాడు" అనే వారుకూడానూ.బళ్ళో పంతుళ్ళుకూడా " ఏం మాధవా! మీ తాతగారు కులాసానా!" అని నల్లూరయ్య క్షేమాలు అడిగేవారు.ఆనందుకు వింతగాఉండేది. తనతాత పెద్ద ధనవంతుడైనా ఏఒక్కరూ

తనతాతను గురించీ అడగక పోడం, సాధారణ రైతైన నల్లూరయ్యను గురించీ అంతా అడగడం ఆనందుకు మింగుడుపడేదికాదు.

కార్తీక పున్నమి రోజున ఆనందు తన తాత గారైన ఆదయ్యతో కలిసి గుడికెళ్ళాడు.అక్కడ అంతా గలగలా మాట్లాడు తుండగా ,ఆనందు తలెత్తి ఆవైపుచూడగా అక్కడ నల్లూరయ్య మనవడు మాధవుని తోకల్సి గుళ్ళో అడుగుపెట్టడం కనిపించింది.అంతా నమస్కరిస్తూ తొలిగి దారిస్తుండగా చిరునవ్వుతో నల్లూరయ్య లోనికెళ్ళి దైవదర్శనం చేసుకుని వచ్చాడు.ఆదయ్య మాత్రం భక్తులంతా నిల్చున్న క్యూలో వెళ్ళి నిదానంగా దర్శనం చేసుకుని బయటికి వచ్చాడు. అంతా ఆదయ్యను చూసీ చూడనట్లే వెళుతుండటం ఆనందుకు వింతగా అనిపించింది .అక్కడ నల్లూరయ్య మెట్ల మీది భిక్షువులకు మనవడు బుట్టపట్టుకుని వెంట నడవగా అరటిపళ్ళు, చలికి కప్పుకోను దుప్పట్లూ పంచుతూ క్రిందికి నడవడం అంతా ఆయనకు మరీమరీ నమస్కారాలు పెట్టడం ఆనందు చూశాడు." తాతా!మనకూ చాలా డబ్బుందికదా! మనమూ ఆయన లాగా ఏదో ఒకటి పేదలకు ఇస్తే వారూ నిన్ను గౌరవిస్తారుకదా!" అన్నాడు. దానికి ఆదయ్య" ఓరీ పిచ్చివాడా! ఈ దానాలవల్ల ధనం ఖర్చవడం తప్ప ఒరిగేదేమీలేదు.ఏం వాళ్ళు గౌరవించక పోతే పోయేదేముందీ!" అన్నాడేతప్ప అక్కడున్న భిక్షువులకు ఒక్క రూపాయికూడా చేయిచాచి ఇవ్వలేదు.అంతా తమను వింతగా చూట్టం ఆనందుకు కాస్త ఇబ్బంది గానే అనిపించింది.

వర్షాకాలంవచ్చింది. తుఫాను , విపరీతమైన వర్షాలు కురవ సాగాయి.ఎత్తుగా ఉన్న ప్రాంతంలో వారి ఇళ్ళు బాగానే ఉన్నా , లో తట్టుగా, నీరు పారేదిశలో ఉన్న వారి ఇళ్ళలోకి నీరు వచ్చి చేరింది.అలా వరదలో చిక్కుకున్న వారిలో ఆదయ్య ఇల్లూ ఉంది. ఇల్లు పెద్ద మండువా లోగిలి ఐనా లోతట్టుగా ఉండటాన ఇంట్లోకి నీరు వచ్చింది.గాదెలలో ధాన్యమూ , బట్టలూ దాచుకున్న దంతా నీటితో నిండిపోయింది. ఇంట్లో ఉండనే వీలుకాకుండా మొలలోతు నీరు నిలిచింది.పిల్లాజల్లా అంతా ఎత్తుగా ఉన్న ధాన్యపుగాదె మీద నిల్చుని ఉన్నారు. ఇంతలో పెద్దగా పిలుస్తూ నల్లూ రయ్య పదిమంది మనుషులతో లోపలికి ఈతకొడుతున్నట్లే వచ్చాడు.మెల్లిగా భుజాలమీద పిలల్లనూ నడుం పట్టు కుని ఊత ఇస్తూ పెద్దలనూ పెద్ద గంపల్లో కూర్చోబెట్టుకుని మోస్తూ ఆడవారినీ జాగ్రత్తగా పట్టుకుని తమ ఇంటికి తీసు కెళ్ళాడు. ఇల్లు ఎత్తుగా ఉండటాన ఎక్కడా నీరు రాకుండా ఉంది. ఇల్లంతా మనుషులే!. వరదలో చిక్కుకున్న వారంతా అక్కడే ఉన్నారు.అందరికీ తమ ఇంట్లో ఉన్న పొడిబట్టలిచ్చి వెచ్చగా గంజి కాచి ఉప్పువేసి ఇస్తున్నారు అందరికీ నల్లూరయ్య కుటుంబ

సభ్యులు. మాధవ ఆనందును చూసి ఆలింగనం చేసుకుని " మాధవా! రారా! ఈ వేడి వేడి గంజిత్రాగు, హాయిగాఉంటుంది" అంటూ గంజి గ్లాసు అందించాడు . ఆదయ్య అక్కడి వాతావరణం , నల్లూ రయ్య చేస్తున్న సేవచూసి సిగ్గుతో తలవంచుకున్నాడు, ఏనాడూ అతడ్ని పలకరించి గౌరవించకపోయినా తనకష్టం చూసి అడక్కుండానే సాయం చేసిన నల్లూరయ్య గొప్పదనానికి మనస్సులోనే నమస్కరించుకుని తన స్వభావం పట్ల తనకే అసహ్యమేయగా ,ఆసమయంలో తాను దాచుకున్న ధనమూ ధాన్యమూ ఎందుకూ పనికి రాకుండా పోడం , కేవలం  నల్లూరయ్య మంచి తనమే తమకుటుంబాన్ని కాపాడటం ఆదయ్యను పూర్తిగా మార్చేసింది. మంచి తనానికి అందే గౌరవం అర్ధమైంది.ఆక్షణం నుంచీ ఆదయ్య మారిపోయాడు.

*************



## 5. మాట.

పున్నం పల్లెలో పూర్ణమ్మ అనే పూటకూళ్ళమ్మ ఉండేది.ఆమె కు ఎవ్వరూలేరు. మరేఇతర పనులు చేయలేక తనకు బాగా వచ్చిన వంటపనినే నమ్ముకుని  పొట్టకూటి కోసం పూటకూళ్ళు పెట్టడం మొదలుపెట్టింది.  మధ్యాహ్నానికి , రాత్రికి భోజన సమయానికి ఒకగంట ముందుగా వచ్చినవారికి మాత్రమే సరిపడా వేడివేడిగా అన్నం, రుచికరమైన కూర, పచ్చడి, చిక్కని మజ్జిగ మాత్రమే పోసి అప్యాయంగా కడుపునిండా వడ్డించేది. "మరికాస్త తిను పెద్దాయనా! ఇంకాఎంతదూరం ప్రయాణముందో, తమ్ముడూ !మరో కొంచెం కూర కలుపుకో! చిన్నోడా! మజ్జిగ త్రాగు నాయనా! ఎండమండుతున్నది.అమ్మాయీ! కాస్త కూరతినూ కమ్మగాలేదాఏం? మన వడా! ఏంటీ తిండి తినడం? “ అంటూ ఆదరంగా వయస్సును బట్టి పిలుస్తూ వడ్డించేది.

అందరి భోజనాలూ అయ్యాక మిగిలింది తాను తినేది. పెద్ద చిన్న అని కాక విస్తరికింత అని సొమ్ముతీసుకునేది. పొదుపుతో పాటుగా శుభ్రంగా పాకశుద్ధి, పాత్రశుద్ధి, పదార్ధ శుద్ధితో భోజనాలు అమర్చేది, అందరికీ వడ్డించి అంతా  తినేముందు తానే 'బ్రహ్మార్పణ బ్రహ్మ హవిః ' అంటూ ప్రార్ధనచేసేది. పూర్ణమ్మ చేతి భోజనం తిన్న వారం తా తిరిగి ఆదారిన వెళ్ళేప్పు డు ఆమె ఇంట్లోనే భోంచేసే వారు. ఆగ్రామం నదీ తీరంలో ఉండటం ,ఎటువైపు వెళ్ళా లన్నా , సంతకైనా, నగరానికి సరుకుల కొను గోలుకైనా ఆగ్రామం నుంచే వెళ్ళాలి. ఆగ్రామం దాటాక  రెండు వైపులా మరో ఐదు మైళ్ళవరకూ ఊరే లేదు.అందువల్ల అటూ ఇటూ వెళ్ళేవారంతా పూర్ణమ్మ ఇంట్లో భోజనం చేసి వెళ్ళాల్సిందే. భోజన సమయం చూసుకుని ప్రయాణం మీద బయల్దేరే వారు. పూర్ణమ్మ వ్యాపారానికి ఏ ఢోకా

లేకుండా సాగు తున్నది. వ్యాపా రాభి లాషకాక బ్రతుకు తెరువుకోసమే పూర్ణమ్మ పూటకూళ్ళను నమ్ము కుంది.

ఒకమారు ఆదారినవెళ్తూ పూర్ణమ్మ ఇంట్లో భోజనాలు చేసేవారిని చూసిన భూషమ్మ ' తానూ పూర్ణమ్మలా పూట కూళ్ళు పెట్టి బాగా సంపాదించ వచ్చని భావించింది. అనుకున్నదే తడవుగా ఆ ఊరికి రెండో చివరన ఒక పెద్ద పాకావేయించుకుని పెద్ద బోర్డు వ్రాయించి కట్టించింది-' రుచికరమైన చౌకభోజనం' అని.ఆదారంట వెళ్ళే బాట సారులను పిలిచి పిలిచి,"ఒక్కమారు భోంచేసి చూడండి! మీకేతెలుస్తుంది.ఒక కూర, పప్పు, పులుసు, పచ్చడి, పెరుగు తో పాటుగా పత్యేక వంటకం పాయసమో, చక్కెర పొంగ లో కూడా ఉంది బాబూ! పూర్ణమ్మ తీసుకునే సొమ్ముకంటే తక్కువగానే నేను తీసుకుంటాను, పిల్లలకు సగం సొమ్ము ఇస్తే చాలు, ఎప్పుడువచ్చినా భోజనం ఉంటుంది."అంటూ ప్రచారం చేసుకోసాగింది.ఇలా చేయడం వల్ల చాలామంది తక్కువ కాసులకు, ఎక్కువ పదార్థా లతో భోజనం పెడుతున్నదని భూషమ్మ పూట కూళ్ళకే ఎక్కువ మంది రాసాగారు. సూర్యోదయం కాగానే వంటచేసేసి దారిన పోయే బాట సారుల ను అటకాయించసాగింది. కొంతకాలం భూషమ్మ వ్యాపారం మూడు పూవులూ ఆరు కాయల్లా సాగింది. బాగానే లాభాలు మూట కట్టుకుంది. పూర్ణమ్మ వ్యాపారం తగ్గిపోయింది. పదార్థాలు ముందుగానే చేసి ఉంచడం వల్ల మిగిలి పోయేవి, వాటిని రాత్రికి వేడిచేసి వడ్డించేది, ఇంకామిగిలితే మరునాడు మధ్యాహ్నం వడ్డించేది.ఒకమారు భూషమ్మ వంట తిన్న పదిమందికి వాంతులు, విరోచనాలు అయ్యా యి. అంతలోనే భూషమ్మలోని వక్ర వ్యాపార బుద్ధి పైకిలేచింది కోడెత్రాచులా. భోజనం చేసేవారిని." ఎక్కువతినకు బాబూ! మళ్ళా ప్రయాణం చేయాలి కదా! పొట్టబరువైతే ఇబ్బందే!, ఏమయ్యా !! కడుపు నిండా తినకు, గాలికి, నీళ్ళకూ జాగాఉంచుకో, ఈ ఊరుదాటితే నీళ్ళైనాదొరకవు మళ్ళా!- ఏం ! అన్నం ఎన్ని మార్లు అడుగుతావు. పెరుగు ఒక్కమారే వేస్తాను, పప్పు కూడా వేసిందాంట్లో సర్దుకోవాలి, ఏనాడూ కూర తిననట్లు అంతంత తింటున్నావ్!! నేనూ బ్రత కాలికదా!"అంటూ తినే వారిని ఈసడించసాగింది. ఆ మాట లకు తినేవారు అర్ధాంతరంగా లేచి పోయేవారు. పైగా ఆశతో ఎక్కువగా వండి, తినేవారికి తక్కువగా వడ్డించి, మిగిలి పోయిన పదార్థాలు రాత్రికి వడ్డించేది. బాటసారులు క్రమేపీ భూషమ్మ తగ్గి పోసాగారు. పూర్వంలా అంతా పూర్ణమ్మ ఇంటికే వెళ్ళి ఆమె ఆప్యాయంగావడ్డించే ఒకటి రెండు ఆధరువులతోనే హాయిగా భోజనం చేసి వెళ్ళ సాగారు. తన వ్యాపారం తగ్గి నపుడూ, పెరిగినపుడూ పూర్ణమ్మ ఒకేలాగా బాటసారులను ఆదరించ సాగింది.

ఒక రోజున భూషమ్మ పూర్ణమ్మ ఇంటికి వెళ్ళి ఆమె భోజనంలోని రహస్యమేదో తెల్సుకుందా మనుకుని ,ముసు గు కప్పుకుని ముఖం కనిపించ కుం డా రాత్రిపూట వెళ్ళింది. భోజనం వడ్డిస్తున్న పూర్ణమ్మ ఆమెను గమనించి , "ఏంభూషమ్మా! ఒంట్లో బాగా లేదా ఏం భోజనానికి వచ్చావు? కులాసానేకదా! మరికాస్త కూరవేసుకో, ఈ కొత్తి మిర కారం ఆరోగ్యానికి మంచిది. మరికాస్త తిను. పెరుగుకంటే మజ్జిగ మంచిది మరో గరిటె పోసుకో, మజ్జిగలోకి కాస్తంత అన్నం వడ్డించనీ.నీవద్ద నేను సొమ్ముతీసుకోను, సాటి వ్యాపారివికదా!" అంటూ ఆప్యాయంగా కొసరి కొసరి వడ్డించింది . పూర్ణమ్మ వ్యాపారంలోని రహస్యం అర్థమైన భూషమ్మ , తానామె పట్ల ఎంతవిరోధభావంతో ఉన్నా తనను ప్రేమగా ఆదరించి మంచిమాటలతో భోజనం వడ్డించిన పూర్ణమ్మ ప్రేమహృదయానికి మనస్సు లోనే ధన్యవాదాలు చెప్పుకుంటూ , సిగ్గుతో తలవంచుకుని వెళ్ళింది.

*************

.



# 6.శ్రమ

లింగంపల్లెలో పోలయ్య అనే ఒక అనాధ ఉండేవాడు.పోలయ్య పసితనం నుంచీ వారూ వీరూ దయతలచి పెట్టిన అన్నం మెతుకులు తింటూ పెరిగి పెద్దయ్యడు.ఇపుడు పోలయ్య యువకుడు.బలశాలి. ఎత్తుగా ధృడం గా ఉండే పోలయ్య కు వెనుకటిలాగా ఎవ్వరూ ఊరికే కడుపు నింపడం లేదు.పైగా పోలయ్య కు ఇపుడు కొద్ది మెతుకులు ఆకలి తీర్చడం లేదు.కనిపించిన వారంతా" ఏరా! పోలయ్య ! ఇంకా పసివాడివా ఏం అన్నాని కి అడుక్కోను, ఏదైనా పనిచేసుకుని తిను."అనసాగారు.పోలయ్య కు ఏపనిచేయాలో ఎలా చేయాలో తెలీదు. ఎన్నడూ పనిసేర్చు కున్న వాడు కాదు.ఎవ్వరూ కడుపు కింత పెట్టక పోయేసరికి ఆ పల్లె విడిచి ఎక్కడికైనా పోదామని ఒకరోజు ఉదయాన్నే లేచి అడవి దారి పట్టాడు పోలయ్య . బాగా నడిచి నడిచి అలసిపోయాడు.ఆకలికి ఆగలేక అడవి మధ్యగా పారే నదిలో నీరు కడుపు నిండా త్రాగి, పక్కనే ఉన్న చెట్టు నీడన విశ్రమించ సాగాడు.ఇంతలో పైనుంచీ కిచకిచ శబ్దం వినిపించింది. ఒక్కసారిగా పిచ్చుకల గుంపు వచ్చి అక్కడ ఏవో కంకుల గింజ లు ముక్కుతో పొడుచుకుని తినసాగాయి. మరో వైపు ఉడుతలు గబగబా చెట్టుమీద నుంచీ క్రిందికి గెంతుతూ వచ్చి కొంతదూరం లో ఉన్న ఒక జామ చెట్టుమీద కెళ్ళి అటూ ఇటూ వెతికిజామ కాయలు చూసుకుని తినసాగాయి. మరో వైపునుంచీ కోతిపిల్లలు క్రిందికి దూకి అటూ ఇటూ వెళ్ళి ఏవోపండ్లూ ఫలాలూ వెతుక్కుని తింటూ చెట్టు మీద కొచ్చిచేరాయి .ఇంతలో ' అబ్బా !' అనే అరు పు వినిపించగా తిరిగి చూసాడు పోలయ్య.ఒక 70ఏళ్ళ ముసలితాత క్రిందపడిన ఎండుపుల్లలు ఏరుకుని కట్టకట్టుకుని నడు స్తూ రాయి దట్టుకుని క్రింద పడ్డాడు. పోలయ్య పైకి లేచి వెళ్ళి అతడిని లేపి కట్టెల మోపు అందుకున్నాడు."తాతా! ఇంత పెద్దవాడివి. ఇలా అడవికొచ్చి కట్టేలేరుకోకపోతే ఏం?"అన్నాడు .తాత బోసినవ్వు నవ్వుతూ" నాయనా! కాళ్ళూచేతులూ ఆడిందాకా ఊరికే ఎవరో ఉచితంగా పెట్టే తిండి తింటే ఒంట బడుతుందా నాయనా! చూడూ ఆపిచ్చుకలు ఆకలికి ఎగిరొచ్చి గింజలు వెతుక్కుని తింటు న్నాయి, రెక్కలు నొప్పులని కూర్చుంటే వాటికి తిండెవరు పెడతారు? ఆ ఉడతలు ఆహారం వెతికి పట్టుకుని కడుపునింపు కుంటు నాయి.ఆనీళ్ళలో చేపలు, చెట్టుమీది కోతులూ, ఆచీమలూ అన్నీ ఆహారంకోసం శ్రమించి కడుపు నింపు కుంటున్నాయి. మరి మనం మానవులంకదా!వాటిని చూసి నేర్చుకోవద్దూ నాయనా! నీవిక్క డున్నావేం?చేసుకోను ఏపనీ దొరక లేదా! నాతో రోజూ రా అడవిలో ఎండుకట్టేలుకొట్టడం నెర్పుతాను.వటినిమిదారంకల్సి అమ్ముకుందాం కడుపునింపుకుందాం." అని తాత చెప్ప గానే పోలయ్య బుద్ధి వెలిగింది.అప్పటినుంచీ ఆతాత తో కలిసి ఉంటూ పనీపాటా నేర్చుకుని కష్టపడి శ్రమచేసి బ్రతకసాగాడు. చూశారా బాలలూ ! ఉచితంగా ఏదీ ఆశించకుండా శ్రమైక జీవన సౌందర్యాన్ని పొందుదాం.



# 7.త్యాగం.

పూర్వం ఒక గ్రామంలో బంగారయ్య అనే ఒక విష్ణు భక్తుడు ఉండేవాడు. అతడు నిరుపేద. తనకుటుంబాన్ని గడుపుకోడమే అతడికి చాలా కష్టంగా ఉండేది. ఎలాగో రోజులు వెళ్ల బుచ్చసాగాడు బంగారయ్య. ఇంటి వారంతా తోచిన పనులు చేసినా అందరికీ రెండు పూటలా భోజనం కడుపు నిండా చాలేది కాదు. ఒకరోజున బంగారయ్య భార్య ధనమ్మ " అయ్యా! నీపేరు బంగా రయ్య, నాపేరు ధనమ్మ మన ముఖాన మాత్రం దరిద్ర దేవత కాపుర ముంది , ఎందుకొచ్చిన పేర్లయ్యా! . పట్టెడన్నం తినేందుకే మనకు సొమ్ములేదు. ఈ ఇంటిని ఎలా గడపాలో నాకు తోచడం లేదయ్యా! పిల్లలు ఎదుగుతున్నారు. భగవంతునికి రోజూ పూజ లు చేస్తూనే ఉన్నా ఆయనకు మన బాధ తెలిసినట్లు లేదు! మనమీద కరుణించ కుండా ఉన్నాడు." అన్నది .

దానికి బంగారయ్య" ధనమ్మా! పూర్వజన్మలో మనం ఎవ్వరికీ పట్టెడన్నం పెట్ట లేదేమో! ఆకలికి అలమటిస్తున్న వారిని చూసి కనికరించ లేదేమో! ఏమాత్రం త్యాగం చేయలేదేమో! దానికే ఈజన్మలో మన కడుపులు నిండటం లేదు. అందుకే పెద్దలు ఉన్నంత లో కొంతైనా దానం చేయమని చెప్తుంటారు. ఈరోజునుంచీ మనం తినే అన్నంలో ప్రతి ఒక్కరం ఒక ముద్ద వేరే ఉంచి ఎవరికైనా పెడుతూ ఉందాం."అన్నాడు. దానికి అంతా సమ్మతించారు. చిత్రంగా ఆరోజునుంచీ వారు అన్నం విస్తళ్లలో వడ్డించుకుని తినే వేళ కు ఒక రాసాగాడు. వారంతా ఒక ఆకులో తమ విస్తళ్లలో అన్నం తలో పిరికెడూ తీసిపెట్టి ఆ సాధువుకు ఇవ్వసాగారు. అలా ఒక పక్షం రోజులు గడిచింది. ఆ రోజున ఆసాధువు యధాప్రకారం వచ్చి " అయ్యా! ఈ పక్షం రోజులపాటు నా ఆకలి తీర్చారు.నేను చంద్రాయణ వ్రతంలో ఉన్నా ను. పాడ్యమి నుంచీ అమావస్య వరకూ రోజూ ఒక్కోముద్దా తగ్గించుకుంటూ అమావాస్య రోజున పస్తుంటాను. తిరిగి పాడ్యమి నుంచీ పౌర్ణమి వరకూ ఒక్కోముద్దా పెంచుకుంటూ పౌర్ణమినాడు కడుపునిండాతింటాను.మీరు ఈ పక్షం రోజులూ నాకు భోజనం పెట్టారు. మీరు పెట్టిన భోజనంలో నేను తినతగింది తింటూ మిగిలింది కాకులకు పెట్టాను.అలా రాత్రి పౌర్ణమి కనుక కడుపారా మీరు పెట్టింది తిన్నాను.మీకు భగవంతుడు తప్పక మేలుచేస్తాడు. అందాకా నేను భోజనం చేసిన ఈ భోజనపాత్ర మీ వద్ద ఉంచండి."అని చెప్పి చకచకా వెళ్ళిపోయాడు. బంగారయ్య ఏదో అతనితో చెప్తుండగానే కనుమరుగయ్యాడు. ఆ భోజనపాత్రను తీసు కెళ్ళి వంట గదిలో గట్టుమీద పెట్టింది ధనమ్మ. ఆరాత్రి వంటచేద్దామని వంట గదిలోకి వెళ్ళగా ఆభోజన పాత్ర నిండా చక్కని భోజన పదార్థాలు నిండి ఉన్నాయి. ధనమ్మ బంగారయ్యను,కుటుంబ సభ్యులందరినీ పిలిచింది.వారంతా వచ్చి ఆ వింత చూసి ఆశ్చర్యపోయారు. బంగారయ్య " ధనమ్మా! చూసావా ! మనం త్యాగభావంతో కాస్తంత మన భోజనంలోంచీ పెట్టసాగ గానే ఆ సాధువు రూపంలో భగవంతుడు వచ్చి మనం పెట్టిది తాను భుజించి ఇంకా కొన్ని మూగ జీవులకూ పెట్టి, మన దౌర్భాగ్యా

న్ని కడిగే సాడు.ఇహనుంచీ మనం ఈ భోజనపాత్రలో వచ్చే పదార్థాలను రోజూ లేనివారికి పెడుతుందాం. మనకు ఉచితం గా వచ్చిన భాగ్యాన్ని పదిమందికీ పంచడం మన ధర్మం "అన్నాడు . అంతా సమ్మతించారు. అలా బంగారయ్య కుటుంబం దైవ ధ్యానం చేసు కుంటూ అనందానం చేస్తూ హాయిగా ఏదిగులూలేకుండా జీవించారు.

నీతి-- నీవద్ద ఉన్నది పంచితేనే తిరిగి నీవు పొందగలవు. భూమి లో గింజలు నాటితే వెయ్యింతలు నీకు తిరిగి లభిస్తుందికదా!

*************



## 8.క్షమ .

పూర్వం కోసల అనే దేశం ఒక అందమైన లోయ లో ఉండేది. చుట్టూ సుందర వనాలు , అడవి ,లోయలు, పండ్ల చెట్లు, నదులు, పూలమొక్కలు, కావలసినన్ని కూరమొక్కలు , ఏడాదికి మూడు పంటలు పండుతూ భూతల స్వర్గంలా ఉండేది.ప్రజలంతా కష్టపడి పని చేసుకుంటూ హాయిగా ఏలోటూ లేకుండా ఉండేవారు. ఆ రాజ్యాన్ని పాలించే రామ రాయలు చాలా సౌమ్యుడు.తరతరాలుగా రాజ్యకాంక్షలేక ఆవంశపు రాజులతా ప్రజా సంక్షేమంకోసం పాటుపడేవారు.కోసలకు కొంత దూరంలో ఉన్న చోళరాజ్యానికి రాజు సింహభూపతి . అతడు దుస్స్వ భావి . ఆశపోతు, కఠినుడు. అతడి చూపు సుభిక్షంగా ఉన్న కోసలపై పడింది . ఎలాగైనా కోసల ను తనరాజ్యంలో కలుపు కుంటే ఆరాజ్యపు సంపద అంతా తన స్వంత మవుతుందని పథకం వేయసాగాడు. ప్రధానమంత్రి " ప్రభూ! కోసల ప్రజలు శాంతి ప్రియులు, మహారాజు మానవతా గుణసంప న్నుడు. హాయిగా ఉండే ఆరాజ్యం జోలికి వెళ్ళకపోడం ఉత్తమం." అని సలహాకూడా ఇచ్చాడు. ఐనా సింహభూపతి మనసు మారలేదు .ఇంతలో చోళ రాజ్యానికి అను కోని ఆపదొచ్చిపడింది. వరుస గా వర్షాలు అదునుకు పడక తీవ్రమైన కరువు కాటకాలు వచ్చాయి.ప్రజలంతా తినను తిండిలేక అవస్థ పడసాగారు. అప్పుడే సిం హ భూపతి ప్రజల మనస్సు మళ్ళించను, తనకోరిక తీర్చుకోను కోసలపై యుద్ధం ప్రకటించాడు. సమాయత్తమై సైన్యంతో బయల్దే రాడు. ఇదేమీ తెలీని కోసల ప్రభువు కనీసం గూఢచార సమాచారం కూడా అందకుండా ఒక్కసారిగా సైన్యం చుట్టు ముట్టడంతో రామ రాయలు విభ్రాంతికి లోనయ్యాడు. ఏంచేయాలో ఆలోచించుకునే సమయం కూడా లేకపోడంతో 'ప్రజలను ఊచకోతలకు గురి చేయ ను ఇష్టం లేని ఆప్రభువు మంత్రి మండలికి నచ్చచెప్పి, తన కుటుంబాన్ని కూడా రహస్య మార్గం గుండా రాణీ గారి పుట్టింటికి పంపేసి,తాను మరో రహస్య మార్గం గుండా మారు వేషంలో ఒక నమ్మిన బంటును తోడుగా తీసుకుని అడవిలోకి వెళ్ళి పోయాడు. ప్రధానమంత్రి శాంతికి చిహ్నంగా కోట గోడపై తెల్ల జెండా

ఎగురవేశాడు. చుట్టు ముట్టిన సైన్యం నుంచీ అంగీకారానికి సంకేతం గా తెల్ల పతాక ఎగురుతూ కనిపించడంతో సేనాని కోట గోడ తలుపులు తెరిపించి,విధిలేక పరాయిరాజుకు స్వాగతం పలికాడు. తమ ప్రభువు పదిరోజుల క్రితం వేటకు వెళ్ళి తిరిగి రాలేదనీ, దానికి ఒక మాసం ముందే మహారాణీ పుట్టింటికి వెళ్ళిపోయారనీ ప్రధాని విన్నవించుకున్నాడు. ఆ సమాధానానికి తాత్కాలికంగా తృప్తిపడ్డ సింహభూపతి తనకు మారుగా తన కుమారుడైన కమల భూప తి ని కోసలరాజ్యానికి అధికారిగా నియమించి ఆరాజ్యం లో పండిన పండ్లు ఫలాలూ, ధాన్యాదికాలూ దిగుబడి మొత్తం సగభాగం తనకు పంపేలా మంత్రి మడంలి పాలక మండలితో ఒప్పందం చేసుకుని వెళ్ళాడు. ఐతే సింహభూపతి తన వేగుల ద్వారా రామ రాయలు కోసం వేట సాగిస్తూనే ఉన్నాడు.శత్రుశేషం ఉండరాదని అతడి అభిప్రాయం. కొంతకాలం తర్వాత ఒకరోజు కమల భూపతి సరదాగా వేటకు అడవికి వెళ్లగా ఒక పులి అతడిని మాటువేసి తరుముకుంది. సైనికులకు దూరమై కమలభూపతి అడవిలో అడ్డం పడి పులిబారి నుంచీ తప్పించుకోను పరుగులు పెట్టాడు. పులి పంజాదెబ్బతో రక్తం శ్రవిస్తుండగా అతికష్టం మీద తప్పించుకోను అడవి లోతట్టు ప్రాంతానికి వెళ్ళిపోయాడు. ఒకచోట ఒక సాధువు అతడ్ని చూసి పులివెంటాడటమూ గమనించి తన బాణంతో ఆ పులిని కొట్టాడు. ఆదెబ్బకు ఆపులి మరణించింది. అలసిపోయి క్రిందపడి పోయిన కమల భూపతిని తన గుప్త నివాసానికి తీసుకెళ్ళి ఆకు పసరుతో వైద్యం చేసి,ఆహారంగా ఫలాలు ఇచ్చి విశ్రాతి కలిగించాడు. ఒకటి రెండు రోజులు కోలుకున్నాక అతడి కోరిక మేరకు అతడిని కోసల అంతఃపురానికి చేర్చాడు.అప్పటికే కుమారుని కోసం కోసలవచ్చి వెతుకుతున్న నరసింహభూపతి తన కుమారుని రక్షించి తెచ్చిన వ్యక్తి వివరాలు అడిగి తెల్సుకుని ,అతడు మరెవరోకాదనీ తన రాజ్యకాంక్ష వల్ల అడవులపాలై కుటుంబానికి దూరమై అడవిలో సన్యసిలా జీవి స్తు న్న రామ రాయలేననీ గ్రహించి పశ్చాత్తాపంతో క్షమార్పణ కోరాడు.అతడి క్షమాగుణానికి నివాళులరించి అతడి రాజ్యాన్ని అతడికి శాస్వతంగా తిరిగి అప్పగించి తనకుమారునితో తన రాజ్యానికి వెళ్ళిపోయాడు.చూశారా బాలలూ! ప్రజా క్షేమంకోసం రామ రాయ లు తనసుఖ సంతోషాలనే వదులుకుని క్షమాగుణంతో శత్రువు మనస్సును జయించాడు .క్షమ అనేది చాలా శక్తివంత మైనది.

******************



## 9.బడాయి భూరుహం .

సిద్ధాంతి ఒక ఆయుర్వేద వైద్యుడు.ఒకరోజున ఆయనకు మందులోకి వేపపూత కావల్సివచ్చి ఊరంతా వెతికినా దొరకలేదు. వెంటనే ఒక వేప మొక్కను తెచ్చి ఇంటిముందు నాటి పాదుచేశాడు. పూర్వం నుంచీ వారింట ఒక కరివేప చెట్టు ఉండేది.వేపమొక్కను చూసి కరివేప నవ్వి "నాపేరులోని చివరి రెండక్షరాలు మాత్రమే నీపేరు! ఆహ్హాహ్హా " అని నవ్వింది.వేప మౌనంగా ఉంది." ఈ ఇంటివారికి నేనంటే చాలా ఇష్టం.నా ఆకులు లేందే వారిఇంట వంట పూర్తవదు. పులిహోర, సాంబరూ,

కూరలూ అన్నీ నాఆకుల వాసనతో ఘుమఘుమలాడు తుంటాయి.నీ ఆకు చచ్చే చేదు. ఎవ్వరికీ పనికిరాని నిన్ను ఈయనెందుకు తెచ్చి నట్లో!"అని గప్పాలుకొట్టింది కరివేప.రోజు వేపకేసి చూసి వెకిలి నవ్వు నవ్వు తుండేది.సిద్ధాతి రోజు వేప పెరుగుదలను పరీక్షిస్తూ ఉండేవాడు.వేప ఇగుర్లు కోసి తెచ్చి ఇంటిల్లిపదికీ తేనెలోకలిపి పెట్టేవాడు. కొంత కాలం గడిచింది. రాలిన వేపాకులుతెచ్చి కరివేపపాదులోవోయసాగాడు.కరివేపకు కపరంపట్టుకుంది ఆ అకులుచూసి.వేప పెద్దదై పూతపూయ సాగింది. సిద్ధాంతి తెల్లని బట్టలు దానిక్రిందపరిచి వేపపూతంతా సేకరించి తన వైద్యంలోకి వాడేవాడు.ఇంటిల్లిపాదీ వేప పుల్లలతో పళ్ళు తోముకునేవారు." మా నోరు వాసనేయకుండా ఫ్రష్ గా ఉంటున్న ది" అనుకో సాగారు వారంతా.వేసవిలో కాసే వేప పండ్లు సేకరించి సిద్ధాంతి ఆరసాన్ని మందుల్లోకి వాడేవాడు.ఆ కార్తీకమాసంలో ఒక వింత వ్యాధి వ్యాపించి మనుషులేకాక , జంతువులూ బాధపడసాగాయి.చెట్లకూ చీడపట్టింది. చుట్టుపక్కల గ్రామాల వారంతా మందుకోసం రాసాగారు. సిద్ధాతి వేపపండ్ల రసంతో జంతువు లకూ,వేపపూత రసంతో మనుషులకూ ,వేప ఆకు రసం తో చెట్లకూ మందు తయారు చేసి వ్యాధులు నయం చేశాడు.ఇంటిల్లిపాదీ కష్టపడ్డారు. బాగా ధనంకూడా సంపదించాడు . చెట్లకు పట్టిన చీడపీడలుకూడా వేప ఆకురసంతో తయారు చేసిన మందు పిచికారీ చేయగా తగ్గిపోయింది.కరివేప ఆకులన్నీ చీడతో జిడ్డుపట్టాయి.సిద్ధాంతి కరివేప కొమ్మలన్నీ కొట్టించి ,

దానిపై వేప రసం పిచికారీ చేశాడు. కరివేప దిగులుగా వేపకేసి చూసింది.వేప" మిత్రమా! దిగులుపడకు, నీ లేత ఆకులు త్వరలోనే బాగా వస్తాయి.నీ ఆకులతో ఇంటివారు వంటచేసు కుంటారులే." అని ఓదార్చి, "నా చేదే నాకురక్ష.నీలాగా కమ్మని వాసనలేనిదాన్ని ఐనా అందరికీ ఎదో ఇలా సేవచేసుకునే భాగ్యం భగవంతుడు నాకు ప్రసాదించాడు."అంది.బడాయి భూరుహమైన కరివేప, తన వాచాలత్వానికి సిగ్గుతో విచరంగా తల వంచుకుంది.

*****************



## 10.శుభ్రతకు బహుమతి

హనుమంతు పదేళ్ళ బాలుడు. రోజు బడికెళ్ళేప్పుడు దార్లో ఎవరైనా వృద్ధులుకనిపిస్తే వారిని రోడ్డుదాటించడమో, వారి చేతిలోని బరువులు వారింటిదాకా తీసుకెళ్ళి ఇవ్వటమో చేసేవాడు.ఒక్కరోజైనా బడికిమాత్రం ఆలస్యంగా వచ్చేవాడుకాదు.బళ్ళోకూడా పంతులుగారికి కావల్సినవన్నీ అందరికంటే ముందుగా అంద చేసేవాడు. బోర్డు మీద పంత్యులుగారు రాసింది అంతా వ్రాసుకో గానే బోర్డు తుడిచేసేవాడు. బోర్డు తుడవను వారానికొక డస్టర్ చేత్తో పాతగుడలతో కుట్టుకొచ్చేవాడు.

క్లాసును పరిశుభ్రంగా ఉంచడంలో తనవంతు కృషిచేసేవాడు. జాతీయపమండుగలు వచ్చాయంటే మామి డాకులతోరణాలు తెచ్చి కట్టేవాడు.జాతీయ జెండాలోకి పూలుతెచ్చేవాడు.వాళ్ళమ్మ ఇంట్లోనే పూలతోట పెంచు తుంటే సాయం చేసేవాడు. చదువు లోనూ, శుభ్రంగా ఉండటంలోనూ , ఆటపాట ల్లోనూ ముందుండే వాడు. ఐతే వాడిక్లాస్ లోని ఎంతోమందికంటే కాస్త పేదవాడు, వాళ్ళ అమ్మానాన్నా రైతుకూలీలు. ఐతే మంచి తనంలో , మానవత్వంలో వాడు వయస్సును మించిన మంచివాడు.

ఒకరోజున వాడు బడికివస్తుండగా ఒక వృద్ధుడు పెద్ద సంచీ మోయలేక అవస్తపడుతూ రోడ్డు దాటుతుండగా చూసి, తన పుస్త కాల సంచీ పక్కనే ఉన్న పండ్లదుకాణంలో ఉంచి, ఆసంచీ తన భుజానపెట్టుకుని ఇల్లు చేర్చాడు.అది తన పెద్ద పంతులుగారిల్లు, ఆవృద్ధుడు పెద్దపంతులుగారి నాన్నగారని తెలిసిందిహనుమంతుకు. ఆయన హనుమంతుకు కొంతడబ్బివ్వబోగా మర్యాదగా తిరస్కరించాడు.మరో రోజున ఒక నిండుగర్భిణీస్త్రీ ఒంటరిగా వేసవి మధ్యాహ్నం నడుస్తూ వెళుతుండగా చూశాడు.ఆమెవద్దకెళ్ళి " అమ్మా! మీకేమన్నా సాయం కావాలంటే చెప్పండి, చేస్తాను, నాకు బడి సమయానికింకా అర్ధగంట ఉంది." అని చెప్పగా ఆమె చేత్తో 'మంచి నీరుకావాలని సైగ చేసింది.వెంటనే తన మట్టి కూజాలోంచీ నీరు వంపి ఆమెకిచ్చాడు. ఆమె నీరుత్రాగి, వాడి తల మీద నిమిరి "భగవమంతుడు నీకు మంచి చేయాలినాయనా!" అని దీవించి వెళ్ళింది. ఎలాంటివి ఎన్నో హను మంతు చేసే వాడు. ఆగ్రామంలో పెద్ద వాళ్ళకు కూడా తెలీనంతమంది హనుమంతుకు తెల్సు.

ఆరోజు స్కూల్ ఇన్స్ పెక్షన్ "పిల్లలూ! అంతా యూనిఫాంలో రావాలి, నీట్ గాఉండాలి ఎవరైనా అపరిశుభ్రంగా వస్తే ఇన్స్పెక్టర్ గారు కోప్పడ తారు.నాకూ కోపంవస్తుంది.శుభ్రంగా ఉన్న వారికి ఒకమంచి బహుమతికూడా ఉంటుం.." అని హెచ్చరించారు పెద్దపంతులుగారు. ఆ ఇన్స్ పెక్షన్ రోజున రోడ్డుదాటుతున్న తనబడిలోచదివే ఒకటోతరగతి పిల్లాడినే లారీక్రిందపడకుండా కాపాడ్డంలో హనుమంతు రోడ్డుమీదపడ్డాడు.చేతులు, కాళ్లూ గీరు కుపోయి రక్తం వచ్చింది.బట్టలన్నీ దుమ్ముకొట్టుకు పోయాయి.బడిసమయ్మ ఐనందున అలాగే బళ్ళో కొచ్చి, పైప్ వద్ద రక్తం మరకలు తుడుచుకుని మట్టి కొట్టుకున్న యూనిఫాం తో క్లాస్ లోకి వచ్చాడు హనుమంతు.

కొంచెం లేటైంది. ఇన్స్ పెక్టర్ గారు క్లాసులో ఉన్నారు.లేటుగా వచ్చిన హనుమంతును చూసి"ఏరా ఇప్పుడా రాడం! బడి సమ యం తెలీదా నీకు?ఆబట్టలేంటి పొలంలోకెళ్ళినేరుగా వస్తున్నావా?" అని గద్దిస్తుండగా ,ఆగ్రామ పంచాయితీ ప్రెసిడెంట్ లోపలి కొచ్చి " హనుమంతూ నాఒక్కగానొక్క బిడ్డప్రాణాం కాచావురా!ఇంద ఈ వెయ్యా

ఉంచు" అని ఇవ్వబో"సార్! నేను డబ్బుకోసం సాయం చేయలేదు. చిన్న వాడు లారీ రాడం చూడలేదు. అందుకే పక్కకులాగాను.ఇద్దరికీ చిన్న దెబ్బలుతగిలాయి. గుడ్డలు మట్టికొట్టుకున్నా యి" అనిచెప్పాడు.పంచాయితీ ప్రెసిడెంటు జరిగింది చ్పెప్పి" ఇంతమంచి వాడ్ని నేనెక్కడా చూడ లేదండీ! ఆలస్యానికి వీనినేమీ అనకండి" అని చెప్పివెళ్ళాడు.

ఇన్స్ పెక్టర్ గారు పెద్దపంతులు ద్వారా వాడి గురించీ తెల్సుకుని ,సంతోషించి" హనుమంతూ!నీలాంటివాళ్ళు దేశానికి అవసరం రా!నీకుశిక్షణ ఇప్పించి సైనిక్ స్కూల్లో చేర్చుతాను. నీ సేవలకు ఇదేబహుమతి" అని మెచ్చు కున్నారు.

నీతి:-చూశారా!వయస్సుతో నిమిత్తం లేకుండా చేతనైనసేవ చేయడం చిన్న తనం నుంచే నేర్చుకోవాల్సి ఉంది.సేవకు ఫలితం తప్పక దక్కుతుంది.సేవే శ్వాస కావాలి.

**************



## 11. ఈవి నోచని బ్రతుకు .

మహా లక్షీపురం లోని ' అష్ట లక్ష్మి ' అమ్మవారి దేవాలయం ముందున్న వేపచెట్టు క్రింద ఒక ముసలి బిక్షగాడు ఉండేవాడు. దేవాలయం నుంచీ వెళుతున్న వారంతా అతగాడిని చూసి జాలిపడి రూపాయో, రెండు దానం చేసేవారు. ఆభిక్షువు పాత గోనె సంచులు సంపాదించుకుని ఒక బొంత కుట్టుకుని , దానిమీద పడు కునే వాడు. రోజంతా అతడు అక్కడే గడిపే వాడు. గుడి నుంచీ వెళ్ళే దాతలు ఇచ్చిన పండూ ఫలహారం తింటూ , గుడిలో ప్రసాదంతో కడుపు నింపు కుంటూ ఉండేవాడు. ఒక్కోమారు వాడి వంటి మీద సరిగా బట్టలు కూడా లేక పోడం చూసిన పూజారి , దేవునికి వాడిన పాత బట్టలు ఇస్తే అవి వంటికి చుట్టు కునేవాడు.

ఆ చెట్టును మాత్రం వదలి ఎక్కడికీ వెళ్ళేవాడు కాదు. పక్కనే విష్ణ్వాలయం, ఆలయ ప్రాంగణం బయట ఉన్న స్థలంలో ఇళ్ళు లేని నిరుపేదలకు ఉచిత నివాసాలకై కొన్ని గదులూ నిర్మించేందుకు భూమిపూజ కూడా జరిగింది. భక్తులు విరివిగా విరాళాలు ఇచ్చారు. ఐతే వాటి నిర్మాణానికి తగిన సొమ్ము ఇంకా సగంకూడా సమకూడ లేదు. శ్రావణ మాసం లో అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తుల సంఖ్య పెరిగి, నిర్మాణా నికి విరాళాలు పెరగడం తో పాటుగా , చెట్టుక్రింది భిక్షగానికీ ఆదాయం రెట్టింపైంది. కాలం గడుస్తోంది. కార్తీక మాసం వచ్చింది. చలి ముదిరింది. ఒకరోజున చలికి వణుకుతూ ఉన్న భిక్షువును చూసి జాలి పడి పూజారి, " బాబూ! చలికి అలావణుకుతూ ఈ చెట్టుక్రిందే రాత్రులు కూడా పడుకోక పోతే వచ్చి గుడి లోపలి అరుగు మీద పడుకో వచ్చుగా !" అని చెప్పారు . " సామీ! నేనింకా ఎంతో కాలం బతకను. గుళ్లో సత్తే పాపం కదా! అయ్యా! నేను సత్తే నన్నీ సెట్టుకిందే పాతేయండి బాబయ్యా! శానాకాలంగా ఈడ్నే ఉంటన్నాగదయ్యా! " అన్నాడు. పూజారి తలూపి వెళ్ళాడు. మరునాడు ఉదయాన్నే పూజారి ఆలయం తలుపులు తెరువను వచ్చే సరికి ముసలి భిక్షువు చనిపోయి ఉండటం గమనిం చాడు , ఊరిపెద్దల నంతా పిలిచి సమావేశం జరిపి, ఆ భిక్షువు కోరిక ప్రకారం అతడ్ని ఆచెట్టుక్రిందే పాతి పెట్టను ఏర్పాట్లు జరిగాయి. శవాన్ని పక్కకు జరిపి , గొయ్యి త్రవ్వటం కోసం భిక్షువు గోతాల్ని తీయగానే, ఆబొంత లోంచీ జలజల మని రూపాయలు రాలి, పెద్ద రాశిగా పడ్డాయి. అది చూసి అంతా అచ్చెరు వందారు. పూజారి "పాపం ఇతడు చలికి వణుకూ వానకు తడుస్తూ , దాచుకున్న ధనాన్ని వదలి రాలేక ఇక్కడే పడుకునే వాడు. సరే మరి ముందు పనికానివ్వండి. గుడి ముందు శుద్ధి చేసి ఆలయ ద్వారాలు తెరుస్తాను" . అనగానే పనివారు త్రవ్వ సాగారు. వారి గడ్డ పార కు ఖంగు ఖంగున ఏదో తగిలింది. వారు భయ భయం గానే త్రవ్వి , అక్కడ నుంచి ఒక పెద్ద పాత కాలపు ఇనుప పెట్టెను ఇరవై మంది కల్సి అతికష్టం మీద పైకి లాగారు. దానికున్న పెద్ద అరచేయంత తాళం కప్ప తుప్పుపట్టి ఉంది. ఊరిపెద్దల ముందు దాన్ని పగుల గొట్టారు. దాని నిండా పాతకాలపు బంగారు నాణాలు ధగధగా మెరుస్తూ కనిపించాయి. పెద్దలతా కల్సి ఆలోచించి ఆ సొమ్ము తో విష్ణ్వాలయం , పేదలకు నివాస భవనం నిర్మించి దాతగా ఆముసలి భిక్షువు పేరు, అతడి ప్రతిమా పెట్టాలని నిర్ణయించి, శవాన్ని అక్కడ ఖననం చేసి, సమాది కూడా నిర్మించారు." బ్రతికి ఉండగా అనుభ వించే యోగం లేదు, గత జన్మలో దాన మన్నది చేయకుండా పిసినారిగా జీవించి దాచిన ధనం ఇది, ఆబంధం వదలక దాని మీదే నివసించాడు. ఈజన్మలో ఆలయం ముందే ఉండి రోజూ దైవదర్శనం చేసుకోడం ,దైవప్రసాదం స్వీకరించడంద్వారా కలిగిన పుణ్యఫలం వల్ల ఇతడు దాచుకున్నఈ ధనం ఇలా ధర్మకర్యానికి ఉపయోగ పడుతున్నది.ఆందుకే పెద్దలు ఉన్నదాంట్లో వందో వంతైనా దానధర్మాలకు వెచ్చించమని చెప్తుంతారు.చూశారుగా ఇతడ్ని, అందరం ఉన్న దాంట్లో కాస్తంతైనా దానధర్మా లకు వెచ్చిద్దాం.దైవకృపకు నోచుకుందాం." అనిచెప్పాడు పూజారి .

నీతి-- దానధర్మాలు చేయడమంటే వచ్చేజన్మకోసం'దైవ బ్యాంకు' లో దాచుకున్నట్లే!

********************



బాలాలకోసం బాలలకు అంకితం -

ఆదూరి. హైమవతీ శ్రీనివాసరావు